


***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

# చివరి విడత: మలి సందడి (17)

## (అనుమతి పాట్లు బెర్లిన్‌లో నేను, నా కుటుంబం)

*నగరవిహారం*

ఈ కథాకాలం 1975–76.

కథారచనది – తిన తిండి, కట్టుబట్ట, నిలువనీడ లేకపోయిన మనిషికి కూడా చేతిలో మొబైలుండే అవకాశమున్న 2019.

ఆ మొబైల్ అలాంటిలాంటిదా – అలనాడు యశోదకు సమస్తవిశ్వాన్నీ చూపించిన కృష్ణుడి నోరులాంటిది.

అందుకే – నగర విహారంలో మాకెదురైన అనుభవాలు, అనుభూతులు పాఠకులతో పంచుకుంటున్నామే తప్ప – బెర్లిన్లో యాత్రాస్థలాల ప్రత్యేకతకీ, వివరాలకీ ఇక్కడ ప్రాధాన్యమివ్వడం లేదు. వాటిపై ప్రత్యేకమైన ఆసక్తి ఉన్నవారు తమ అరచేతిలో కృష్ణుడి నోటిని తెరిపిస్తే సరిపోతుంది.

నగరంలో తొలుత మేము చూద్దామనుకున్నది జూవలాజికల్ గార్డెన్. ఒక్క అక్షరంలో చెప్పాలంటే – జూ.

పిల్లలతో వెడుతున్నాం కాబట్టి, బయట మన పిల్లలు ఇష్టపడి తినేవన్నీ దొరకవు కాబట్టి – పిక్నిక్కుకి వెడుతున్నట్లు తయారయ్యాం.

పులిహోర చేసి – కాళీ డిక్ మిల్ష్ (పెరుగు) డబ్బాలు రెండింటిలో సద్దాం. రెండు 2–మినిట్ బియ్యం పొట్లాల్ని రెండు నిముషాలు మరుగునీళ్లలో వేసి – అన్నం పొట్లాలుగా మార్చాం. ఓ పెరుగు డబ్బా, చిన్న భరిణలో ఊరగాయ, ఇంకా బిస్కట్ల పాకెట్లు – ఇవీ మా తిండి సరంజామా. ప్లాస్టిక్ పళ్లాలు, గ్లాసులు, చెంచాలు వగైరాలెలాగూ తప్పవు.

జూలో పిల్లలు చాలా ఎంజాయ్ చేశారు. అక్కడ ఓ చిన్న బాలుడి శిల్పంలో మూత్రవిసర్జనే – జలయంత్రంగా రూపొందడం మా బాబుని బాగా ఆకర్షించింది. వాడది మాకు చూపించి తెగ సిగ్గు పడ్డాడు. ఐతే వాడికి సిగ్గుకంటే ఎక్కువగా నవ్వొస్తోందనీ, ఆ నవ్వాపుకుకోవడంలో భాగమే సిగ్గనీ కూడా మా కర్థమైంది.

జూలు మాకు మరీ కొత్తేం కాదు.

జర్మనీ రావడానికి ముందు కలకత్తాలో ఆలిపూర్ జూ చూశాం. అది చాలా పెద్దది. మొదటిసారిగా ఓ ఆడ సింహాన్ని, మగ పులితో జత కట్టించి టైగాన్ అనే సంకర జంతువుకి జన్మనిచ్చిన ఘనత ఆ జూది. మేమక్కడ టైగాన్‌ని చూసి థ్రిల్లయ్యాం.

ఇక మేముండే భువనేశ్వర్లో జగత్ప్రసిద్ధి కాంచిన నందనకానన్ జూ ఉంది. క్రూర జంతువులతో సహా అనేక పక్షులు, జంతువులు సహజవాతావరణమైన అడవితో కలిపిన బోనుల్లో దర్శనమివ్వడం – అక్కడ ప్రత్యేక ఆకర్షణ.

జూ ఎంజాయ్ చెయ్యడానికి అప్పటికంటే ఇప్పుడు పిల్లలు మరికాస్త పెద్దవాళ్లయ్యారు.

బెర్లిన్ జూలో జంతువులకు అంత చక్కటి సహజవనం లేదు కానీ – కృత్రిమ వాతారవరణంలో ఉన్నా అవి అంతవరకూ మేం చూసిన మన జూలలో వాటికంటే ఎంతో పుష్టిగానూ, ఉత్సాహంగానూ కనిపించాయి. ధనమే వాటికి వనశోభనూ ఇచ్చి ఉంటుందనుకున్నాం..

మన జూలలో అరుదైన పోలార్ బేర్‌ని అక్కడ చూశాం. రకరకాల పక్షులతో పాటు, ఆక్వారియం కూడా ఉందక్కడ. ముక్కు మరీ ఎర్రగా ఉన్న ఫ్లెమింగోలని మా పిల్లలు చాలా ఎక్కువ కాలం గుర్తుంచుకున్నారు.

మా జూ ప్రయాణం విహారంలా కాదు. ఆఫీసుకెళ్లినట్లుంది.

పెద్ద జూ. ఒక్క రోజులో చూసెయ్యాలి. అందుకని ప్రతి చోటా ఎక్కువసేపు ఆగలేం. తొమ్మిది నుంచి ఒంటిగంట దాకా తిరిగేక లంచి. మళ్లీ సాయంత్రం ఐదు దాకా తిరుగుతూ మధ్యమధ్య పిల్లలకి స్నాక్సు.

ఇంటినుంచి తిండి తెచ్చుకుని తినడానికి అభ్యంతరాలేం లేవు సరికదా, సదుపాయాలు కూడా బాగా ఉన్నాయక్కడ.

ఆ ట్రిప్పులో ఓ విషయం గమనించాం.

అన్ని జన్మలలోకీ ఉత్తమమైనది మానవజన్మ అంటారు కానీ – అది మనిషి మనిషిలా ఉన్నప్పుడేనేమో!

ఎందుకంటే – షాపుల్లో తిరిగినప్పుడు పిల్లలకి సంబంధించినంతవరకూ అక్కడుండేది మనుషులూ, బొమ్మలూ! ఓ గంట గడిచేసరికి వాళ్లలో అలసట కనబడేది. మాటలతో మరిపించి మురిపించి ఎలాగో ఇల్లు చేరేదాకా వాళ్ల ఉత్సాహం నిలబడేలా చేసేవాళ్లం.

కానీ జూలో వాళ్లు 9–5 మా ప్రమేయం లేకుండానే హుషారుగా ఉన్నారు. తిండి కూడా మేమడిగి పెట్టడమే తప్ప వాళ్లకి వాళ్లుగా అడగలేదు. మనుషులమధ్య కంటే జంతువుల మధ్యే మనిషికి ఎక్కువ రెలాక్సేషన్ ఉంటుందని – ఇంకా మానవ సహజ ప్రవృత్తికి దూరం కాని పసివాళ్లు ఋజువు చేశారా అనిపించింది.

''ఏమో అనుకున్నాను – పిల్లలతో నగరవిహారానికి ప్రతిసారీ ఇలాగే రోజుమొత్తం కేటాయించొచ్చునని మా ఫ్రెండ్సుకి చెప్పాలి'' అన్నాను.

''చటుక్కున అలా చెప్పెయ్యకండి. అందరు పిల్లలూ మనవాళ్లలా ఉండరు'' అంది శ్రీమతి.

తన పిల్లల ఘనతని ప్రకటించే అవకాశాన్ని పొరపాటున కూడా వదులుకోని మాతృమూర్తి ఆమె.

జూ కాక మేము సందర్శించిన ఇతర ప్రదేశాల్లో – చాలావరకూ మా నిత్యకృత్య విహారాల్లో భాగమే. వాటిని అలాగే చూశాం.

ప్రత్యేకంగా ప్రోగ్రాం వేసుకుని చూసినవాటిలో 'గ్రూయ్‌నే వాల్డ్' (హరిత వనం) కొంత నిరుత్సాహపర్చింది.

అది అడవే కానీ, అందులో జంతువులుండవు. చిత్రమేమిటంటే పాములు, విషపు పురుగులు వంటివి కూడా తటస్థపడవు.

ఎంతసేపైనా ఎంతదూరమైనా నడవడానికి అనువైన చక్కని కాలిబాటలున్నాయక్కడ.

అక్కడకు వచ్చే యాత్రీకుల్లో చాలామంది అక్కడ రిసార్ట్సులో ఉండి ప్రకృతిని ఆస్వాదించడానికే. పిల్లలకి ఉత్సాహం పుట్టించే విశేషాలు బొత్తిగా లేవు. అదీ మా నిరుత్సాహానికి కారణం. ఏమైతేనేం మా జాబితాలో మేము చూసిన ప్రదేశాల్లో ఓ నంబరు పెరగడానికి సహకరించింది మా హరితవనం యాత్ర.

బెర్లిన్ వాల్ విషయంలో అలా అనుకుందుకు లేదు.

బెర్లిన్ గోడ ఒక యాత్రాస్థలం. దాన్ని చూడ్డానికి ప్రపంచం నలుమూలలనుంచీ వస్తారు యాత్రీకులు.

మేము బెర్లిన్ నగరంలోనే ఉంటున్నాం కాబట్టి ఒకరోజు సకుటుంబంగా అక్కడికెళ్లాం.

అక్కడ కూడా పిల్లలు ఉత్సాహపడేందుకేం లేదు. ఐతే ఏదో యాత్రాస్థలంలా కాక, ఊరి మధ్యలోనే ఉండడంవల్ల – పిల్లలకి మామూలుగా బయటికెళ్లినట్లే ఉంది.

ఆ గోడ మామూలుదా!

ఒకే భాష మాట్లాడే పౌరుల్ని – బలవంతాన తూర్పు పశ్చిమాలుగా రెండుగా విడగొట్టింది రెండవ ప్రపంచయుద్ధం. వారి మధ్య అడ్డుగోడ కట్టింది తూర్పు విభాగం.

ఒకే భాష మాట్లాడేవారు – కులం, వర్గం, పక్షం పేరిట తమమధ్య తమకుతామే అడ్డుగోడలు కట్టుకోవడం ఘనతగా భావిస్తున్న నేటి స్వదేశ పౌరులకు – అర్థం కాకపోవచ్చు కానీ – బెర్లిన్ గోడ నిర్మాణం చరిత్రలో ఒక అత్యంత విషాదఘట్టం.

ఆ గోడ చరిత్ర ఏ వికీ నడిగినా చెబుతుంది. దాని గురించే ఇదే రచనలో హానోఫర్‌నుంచి బెర్లిన్ ప్రయాణంలో కొంత ప్రస్తావించి ఉన్నాను.

మామూలు గోడ.

నిచ్చెనేసుకుని ఎక్కి అవతలివైపుకు దూకడానికి వీలైన గోడ.

కొన్ని చోట్ల గోడకవతలి ప్రాంతం సుస్పష్టంగా కనబడే గోడ.

గోడకవతల తూర్పు జర్మనీ. ఇవతల పశ్చిమ జర్మనీ.

అటు సామ్యవాదం పేరిట నియంతృత్వం. ఇటు స్వేచ్ఛ పేరిట విశృంఖలం.

చిన్నప్పుడు నాకు – దేశాల మధ్య, రాష్ట్రాల మధ్య, జిల్లాల మధ్య సరిహద్దుల గురించి విన్నప్పుడు అవెలాగుంటాయోనని కుతుహలంగా ఉండేది.

పుట్టేక చాలాకాలం పాటు నేను తిరిగినవి మా చుట్టుపక్కలే నాలుగైదు ఊళ్లేమో, అంతే!

చిన్న చిన్న గ్రామాలమధ్య కూడా పొలిమేరలుంటాయి కానీ – నేను వాటిని సరిహద్దులుగా గుర్తించలేదు. ఒక గ్రామంనుంచి మరో గ్రామానికి కాలినడకన వెళ్లేవారికి సరిహద్దులేం తెలుస్తాయి? ఆస్తులైతే ఏమో కానీ, ఏ ఊరైనా మనూరే అనిపించడంతో స్వంతూరుకీ పొరుగూరికీ తేడా తెలిసేది కాదు.

1962లో ఎమ్మెస్సీ చదవడానికి ట్రయిన్లో మొదటిసారి విశాఖపట్నం వెళ్లినప్పుడు నేనెక్కిన పాసెంజర్ తుని పట్నం దాటుతుండగా ఓ బ్రిడ్జి వచ్చింది. మేము తాండవ నదిమీంచి వెడుతున్నామనీ, నదికివతల తూర్పు గోదావరి జిల్లా అనీ, అవతల విశాఖపట్నం జిల్లా అనీ మా నాన్నగారు నాతో చెప్పినప్పుడు ఒకరకమైన థ్రిల్ కలిగింది. బ్రిడ్జి దాటగానే పాయకరావు పేట వస్తే – ఓహో, ఇది విశాఖపట్నం జిల్లా కాబోలు ఆని కొంచెం కొత్తగా ఫీలయ్యాను.

విశాఖపట్నం చేరుకున్నాక కొన్నాళ్లు ఏదో కొత్త ప్రాంతానికి వచ్చిన అనుభూతి. కానీ కొన్నాళ్లే!

అప్పట్లో తెలుగునాట ఉన్నవి మూడంటే మూడే విశ్వవిద్యాలయాలు. అందువల్ల ఆంధ్రా యూనివర్సిటీకి రాష్ట్రవాసులే కాదు, దేశవాసులు కూడా నలుమూలలనించీ వచ్చేవారు. అక్కడ చదివేవారిలో కొందరు విదేశీయులు కూడా ఉన్నారు.

క్రమంగా నాకు అర్థమైంది – స్థానికుల యాసలో కొంచెం తేడా ఉన్నప్పటికీ విశాఖపట్నం కూడా అసలు సిసలు తెలుగు ప్రాంతమే అని. జిల్లాలంటే కేవలం పరిపాలనాసౌలభ్యానికే తప్ప తెలుగువారంతా ఒక్కటేనని గ్రహించాను.

ఆతర్వాత గోదావరి, కృష్ణా, నెల్లూరు, వరంగల్, హైదరాబాదు వగైరా జిల్లాల ద్వారా పయనిస్తున్నప్పుడు అవి నేను పుట్టిపెరిగిన ప్రాంతంనుంచి భిన్నమన్న భావం కలుగలేదు. దాంతో మునుపటి థ్రిల్ కలగలేదు.

ఒరిస్సాలో ఉద్యోగమొచ్చేక – భాషతో నిమిత్తం లేకుండా భారతీయులంతా ఒక్కటేననీ, రాష్ట్రాల విభజన కూడా పరిపాలనా సౌలభ్యానికేననీ అనిపించింది.

జర్మనీకి వచ్చినప్పుడు మాత్రం వేరే దేశానికి వచ్చిన భావన కలిగిందంటే – అందుకు కారణం సంప్రదాయంలో సంస్కృతిలో రెండు దేశాలూ విభిన్నమవడం కావచ్చు. ఇప్పటి ఎక్స్‌పోజర్ నాకప్పుడు లేకపోవడమూ కావచ్చు.

కానీ బెర్లిన్లు రెండూ ఒకటేననీ, వాటిని బలవంతాన విడగొట్టారనీ – మనిషి కట్టిన ఈ గోడ చెబుతోంది.

గోడకివతలా, అవతలా ఉండే మనుషుల భావోద్వేగాలతో కరడు కట్టినట్లున్న ఆ గోడని చూసి కాసేపు అప్రతిభుణ్ణయ్యాను.

కేవలం భౌగోళికప్రమాణాలతో విడిపోవాల్సి వచ్చిన అన్నదమ్ములు, తల్లీ బిడ్డలు వగైరాల గురించి చరిత్రలో చదివినదంతా స్ఫురించి ఆ దృశ్యాలన్నీ ఒక్కసారి కళ్లకు కట్టాయి.

నా దగ్గర బంధువులంతా అట్నించి అసహాయంగా జాలిచూపులు చూస్తూ – 'ఈ జన్మకి మనం కలుసుకోగలమా?' అని వాపోతున్నట్లు అనిపించి కళ్లలో నీళ్లు తిరిగాయి.

పిల్లలకివేం తెలియవు. వాళ్లు వాళ్ల ధోరణిలో మామూలుగా ఉన్నారు.

శ్రీమతి నన్నెప్పుడూ ఓ కంట కనిపెడుతూనే ఉంటుంది. నా మూడ్ తెలిసిందేమో, ''గోడ దాకా వచ్చాం. వచ్చినట్లు సాక్ష్యం లేదు. ఫొటోలు తియ్యండి'' అంది నా ఆలోచనల దారి మళ్లడానికి.

కోనికా చిన్న కెమేరా. అది నా ఓవర్‌కోట్ జేబులో ఉంటుంది. చటుక్కున బయటకు తీసి, తననీ పిల్లల్నీ గోడకు కాస్త దగ్గరగా వెళ్లి నుంచోమన్నాను.

వాళ్లు అలా వెళ్లి నిలబడ్డారో లేదో – కాస్త దూరంలో నాకో పోలీసు కనిపించాడు.

అతణ్ణి చూడగానే కొంత భయం, కొంత అనుమానం!

ఫొటోలు తియ్య కూడదని అక్కడ బోర్డేం పెట్టలేదు కానీ – రెండు దేశాల సరిహద్దు ప్రాంతమది మరి!

మనది కాని దేశం. ఇలంటిచోట తప్పు చేస్తే సంజాయిషీ ఇచ్చుకునే అవకాశం కూడా ఇస్తారో ఇవ్వరో తెలియదు. ముందు అరెస్టు చేసి తీసుకుపోతారేమో!

''అక్కడ పోలీసున్నాడు. ఇందాకా లేడు. ఇప్పుడే వచ్చాడు. కాసేపట్లో వెళ్లిపోతాడనిపిస్తోంది. కొంచెం ఆగుదామా'' అన్నాను.

శ్రీమతికి అలాంటి భయాలేమున్నట్లు లేదు. ''మనని చూసాడు. ఫొటో తీసుకుంటామని గ్రహించే ఉంటాడు. ఇక్కడ ఫొటోలు తియ్యకూడదని రూలుంటే, దగ్గర్లో బోర్డు పెట్టాలి. బోర్డు లేకున్నా తనే వచ్చి ఓసారి హెచ్చరించాలి. అలాంటిదేం జరుగలేదుగా! ఏం ఫర్వాలేదు, తియ్యండి'' అంది.

ఆమె ధైర్యానికి ఆశ్చర్యపడ్డాను. కానీ నాకింకా భయం పోలేదు. తనముందు చిన్నబోకూడదని, ''నాకైతే ధైర్యం లేదు. నీకు ధైర్యముంది కాబట్టి, నేనక్కడ నించుంటాను. నువ్విలాగొచ్చి ఫొటో తియ్యి'' అన్నాను.

''అంటే, పోలీసొచ్చి ఏదో చేస్తాడనా మీ భయం?'' అంది శ్రీమతి.

''ఏదో చేస్తాడని కాదు, ఆ చేసేది అరెస్టు కావొచ్చని భయం'' అన్నాను.

శ్రీమతి ఉలిక్కిపడింది. అంతలోనే దెబ్బ తిన్నట్లు, ''అంత భయంగా ఉన్నప్పుడు మరి నన్నెందుకు ఫొటో తియ్యమన్నారు? పోలీసొచ్చి నన్నరెస్టు చేస్తే మీకేం ఫర్వాలేదా?'' అంది.

''ఫర్వా ఉందో లేదో నీకు తెలుసు. కానీ ఫొటో తియ్యాలని సరదా పడుతున్నావు కదా అని సరేనన్నాను''

''తెలియక సరదా పడినందుకు అరెస్టయినా ఫర్వాలేదనుకున్నారా?'' శ్రీమతి గొంతులో నిష్ఠూరం.

''మరి నీ సరదా తీరడం నాకు చాలా ముఖ్యం''

''అలాంటప్పుడు ఫొటో మీరు తియ్యొచ్చుగా'' ఉక్రోషంగా అంది శ్రీమతి.

''తీసేవాణ్ణే కానీ – ఫొటో తీసినందుకు పోలీసొచ్చి నన్నరెస్టు చేస్తే – ఈ పరాయి దేశంలో నువ్వూ పిల్లలూ ఏమైపోతారు? అదే నిన్నరెస్టు చేస్తే – నీకు నేనున్నాను. నా ప్రయత్నాలు చేసి నిన్ను విడిపించుకోగలను. అర్థమయిందా?'' అన్నాను.

''అబ్బా, ఎంత దూరం వెళ్లారండి!'' అని చటుక్కున నవ్వేసింది శ్రీమతి.

‘‘ముందుచూపు – ఇలాంటిచోట్ల అదుండాలి!’’ అన్నాను గొప్పగా.

‘‘సరే, మీమీదా, మీ ముందుచూపుమీదా నాకు నమ్మకముంది. పిల్లలూ, మీరూ అటెళ్ళి నించోండి. ఫొటో తీసి అరెస్టయిపోవడానికి నేను రెడీ’’ అంది. ఆ గొంతులో ఎక్కడా భయం లేదు.

నేను, పిల్లలు గోడకు దగ్గరగా నించున్నాం.

శ్రీమతి కెమేరాలోంచీ మమ్మల్ని చూస్తూ, ‘‘ఏమండీ, పిల్లలు జాగ్రత్త! బాబు నన్నొదిలి ఎక్కువ సేపుండలేదు. మీరు నన్ను విడిపించేసరికి ఎంత కాలం పడుతుందో ఏమో! వాడు నాకోసం బెంగెట్టుకోకుండా చూసుకునే బాధ్యత మీది!’’ అని అప్పగింతల మాటలు చెప్పింది.

దుష్యంతుడి వద్దకు వెడుతున్న శకుంతల అడవిలో మొక్కల్నీ, పెంపుడు జంతువుల్నీ చెలికత్తెలకు అప్పగించే దృశ్యం స్ఫురించింది నాకు.

ఐతే శ్రీమతి గొంతులో కొంటెతనమే తప్ప ఆవేదన లేదు.

కొన్ని విషయాల్లో ఆడవాళ్ళకు సిక్స్‌త్ సెన్స్ ఉంటుందంటారు. ఆదే ఆమెకు ధైర్యాన్నిచ్చిందేమో!

ఆ పోలీసు అక్కడే ఉన్నాడు. శ్రీమతి ఫొటో తీసినా తను మా జోలికి రాలేదు.

అలాగే జరుగుతుందనుకున్నాను. కానీ నమ్మకానికి ముందుగా తనని ప్రయోగించాను.

తర్వాత నేను ఇటొచ్చి శ్రీమతిని అటెళ్ళమన్నాను.

కెమేరాలో వాళ్లని చూస్తుంటే పిల్లలు మామూలుగానే ఉన్నారు కానీ, శ్రీమతికి మాత్రం నవ్వాగడం లేదు. చటుక్కున క్లిక్ మనిపించాను.

‘‘అయ్యో! రెడీ చెప్పలేదు’’ అంది శ్రీమతి.

‘‘రెడీ చెబితే మళ్లీ ఆ నవ్వెక్కడ దొరుకుతుంది? ఫొటో వచ్చేక – భలే తీశారండీ అని నువ్వు తెగ మెచ్చుకోకపోతే చూడు’’ అని, ‘‘ఇలా రోజుకొక్కసారైనా నవ్వుతూండొచ్చుగా, ఎంత బాగున్నావో’’ అన్నాను.

మామూలుగా ఇలాంటి మెప్పుకి కొంచెం సిగ్గు పడుతుందామె. కానీ అప్పుడు, ‘‘పోలీసుని చూసి భయపడిపోయిన మీ ముఖంలోకి – నేను ఫొటో తీసేక ఎంత ధైర్యమొచ్చిందో! ఫొటో తీస్తున్నప్పుడు మీ మొహంలో ధైర్యం చూస్తుంటే నవ్వాగలేదు మరి!’’ అని మళ్లీ నవ్వింది.

నా పిరికితనాన్ని గేలి చెసిందని తెలుస్తోంది.

కానీ ఆ నవ్వు!

పారిజాతాపహరణ కావ్యంలో సత్యభామ తన్నినప్పుడు ‘అది నాకు మన్ననయ’ అని శ్రీకృష్ణుడెందుకన్నాడో అర్థమయింది.

అప్పట్నించి ఇప్పటిదాకా శ్రీమతి ఆ ఫొటో సంఘటన విషయమై ఏదో సందర్భంలో నన్ను దెప్పుతూనే ఉంటుంది.

బెర్లిన్ గోడని సందర్శించేక ఓసారి గోడకి అటు వైపు వెళ్లి తూర్పు బెర్లిన్ చూడాలని శ్రీమతికి అనిపించింది.

ఈ యాత్రకి అనుకోకుండా మాకు ప్రసాద్ దంపతుల తోడు దొరికింది.

ప్రసాద్ దంపతుల పరిచయం విచిత్రంగా జరిగింది మాకు.

ఒకసారి విల్మెర్స్‌డార్ఫర్ స్ట్రాసేలో మేము, పిల్లలు విండో షాపింగు చేస్తుంటే – మాముందు వెడుతున్నారు ప్రసాద్ దంపతులు.

మామూలు మధ్యతరగతి జంటలా ఉన్నారు. చలి ఎక్కువగా ఉండడంవల్ల చెవులు మూసుకుందుకు కాబోలు, ఓవర్‌కోట్ పైన టోపీ కూడా పెట్టుకున్నారు. ఇద్దరూ ఇంచుమించు ఒకే పొడుగు కావడంవల్ల ఆమె అతడికంటే పొడుగ్గా అనిపించింది.

మన జంటలు బయట నడిచేటప్పుడు – మధ్య రవంత దూరముంచి స్నేహితుల్లా మసలడం కద్దు. వీళ్లు మాత్రం ఇక్కడి జంటల్లా ఒకరినొకరు రాసుకుంటూ ఒకరిమీద ఒకరు పడిపోతూ ముందుకెడుతున్నారు.

అందువల్ల వాళ్లు మమ్మల్ని ఆకర్షించారు.

''ఎంత జర్మనీలో ఉంటే మాత్రం – మన పద్ధతిలో మనముండాలి కానీ, వాళ్లు చూడు, ఒకరిమీద ఒకరు ఎలా పడిపోతున్నారో'' అంటూ శ్రీమతికి చెప్పాను.

''నేనూ గమనించాను కానీ, స్వరం కాస్త తగ్గించండి. వాళ్లు తెలుగువాళ్లయినా కావచ్చు'' మందలించింది శ్రీమతి.

అంతలో ముందుకు దూసుకుపోతున్న వాళ్లు ఆగారు. ఎందుకో అనుకున్నాం కానీ వాళ్లు మాకోసమే ఆగారు.

''మీరు తెలుగువాళ్లా?'' అడిగాడతడు నన్ను పలకరిస్తూ.

శ్రీమతి అనుమానం నిజమే ఐనందుకు బిక్కచచ్చిపోయాను. ఎందుకంటే – తెలుగువాళ్లా అనడిగాడు కానీ కాదని అనుమానమున్నట్లు లేదు. ఉంటే జర్మన్లో అడక్కుండా నేరుగా తెలుగులో ఎందుకడుగుతాడు?

''ఎలా తెలిసింది? మా మాటలు విన్నాడా?'' అని ఆలోచిస్తూ ఎలాగో తమాయించుకుని అతడిని చూస్తే – ఆ కళ్లు నేను ఔననాలని ఆశగా చూస్తున్నాయి.

''అంటే – అతడిలో ఏమూలో అనుమానముంది. బహుశా ఇందాకటి మా మాటలు వినుండడు'' అనుకున్నాను.

''ఉంటున్నది బెర్లిన్లో కదా అని, ఎక్కడపడితే అక్కడ నోటికొచ్చినట్లు తెలుగులో కామెంట్సు పాస్ చేయకూడదు'' అని కూడా అనుకున్నాను.

''మేము తెలుగువాళ్లమే'' అని మావాళ్లని పరిచయం చేశాను.

పరస్పరం నమస్కారాలయ్యేక ప్రసాద్ అన్నాడు, ''మీరు విండో షాపింగ్ చేస్తున్నారు. మిమ్మల్ని దాటుకుంటూ వెళ్లాం. నా భార్య మీ పిల్లల్ని చూసి – ఎంతో ముచ్చటపడి – మీరు తెలుగువాళ్లయితే బాగుణ్ణనుకుంది. అడిగేస్తే సరిపోతుందిగా అని ఆగాం''.

వాళ్లు మేము పిల్లలతో తెలుగులో మాట్లాడ్డం వినుంటారు.

మమ్మల్ని దాటేక బహుశా తమలో తాము మా గురించి మాట్లాడుకుంటూండి ఉంటారు.

చలికి చెవులు కప్పుకుని ఉన్నారుగా, మాటలు వినిపించడానికి క్లోజుగా మూవ్ ఔతున్నారన్నమాట!

''దేశం కాని దేశంలో మన మాట వినబడితే ప్రాణం లేచొచ్చినట్లుంటుంది. పలకరించి మరీ పరిచయం చేసుకున్నందుకు ధన్యవాదాలు'' అన్నాను.

''మీరు చక్కగా పిల్లలతో వచ్చారు. మా బాబుకిప్పుడే ఏడాది నిండింది. వాణ్ణి ఇండియాలో మా అమ్మానాన్నల దగ్గర వదిలేసొచ్చాం. ఇక్కడికొచ్చేక మనసంతా వాడి మీదే! చాలా తప్పు చేశామనిపించింది'' అంది ప్రసాద్ భార్య.

కన్నబిడ్డల్ని వదిలుండడం ఎంత కష్టమో, తండ్రిగా నేననుభవించాను. ఇక తల్లి సంగతి చెప్పాలా?

''తను బాబుకోసం బెంగెట్టుకుంది. ఎక్కడ పిల్లలు కనిపించినా కళ్లనీళ్లెట్టుకుంటుంది'' అన్నాడు ప్రసాద్.

ఈలోగా ఆమె, ''ఒక్కసారి మీ బాబు నెత్తుకోవచ్చా?'' అనడిగి అనుమతించేలోగానే వాణ్ణోసారి ఎత్తుకుని గట్టిగా హత్తుకుని కిందకి దింపేసింది.

బాబు క్షణం పాటు ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఆశ్చర్యంగా ఆమెని చూసి చటుక్కున శ్రీమతి వెనక్కి వెళ్లి తన కాళ్లు పట్టుకుని ఆమెనే తొంగి తొంగి చూస్తున్నాడు.

నెక్స్ట్ తనేనని అనుమానమొచ్చిందో ఏమో పాప కూడా చటుక్కున వెనకడుగు వేసి నేల చూపులు చూస్తోంది.

ప్రసాద్ భార్యను చూస్తే – సృష్టికే అద్భుతమనిపించే తల్లి రూపం కనిపించింది.

''మనం తరచు కలుసుకుందాం'' అన్నాడతడు.

మాకోసం కాదు, మా పిల్లలకోసమని గ్రహించాను.

ఆ తర్వాత మేము ఆడపా తడపా కలుసుకున్నాం. వాళ్లు చాలా స్నేహపాత్రులు.

వాళ్లకి తూర్పు బెర్లిన్ చూడాలనుంది. పిల్లలతో కలిసి చూస్తే ఆ మజాయే వేరని కలిసి వెడదామన్నారు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments